# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

## ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


ప్రసారార్థం/ ప్రచురణార్థం :

విజయవాడ
తేదీ : ఆగస్టు28, 2016

**విద్యుత్ పోరాట అమరులస్ఫూర్తితో సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటం**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వైవి, కృష్ణయ్య**

విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తితో సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాడాల్సి ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.కృష్ణయ్య తెలిపారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి సంస్మరణ సభ ఆదివారం ఉదయం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వై.వెంకటేశ్వరరావు, వి.కృష్ణయ్య మాట్లాడుతూ అప్పట్లో సంస్కరణల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడం ఒక అంశంగా మాత్రమే ఉందని, ప్రస్తుతం అన్నిరంగాల్లోనూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంస్కరణలు అమలు జరుపుతున్నాయని తెలిపారు. అభివృద్ధి అనే ముసుగును తగిలించి ప్రజలను భ్రమల్లోకి తీసుకెళుతున్నారని తెలిపారు. పేదల సంక్షేమంపై దృష్టి సారించకుండా, కొద్దిమంది వ్యాపారవేత్తలకు లాభాలు కలిగించే వ్యాపారీకరణ, ప్రైవేటీకరణను ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు. విద్యా, వైద్య రంగాలే దీనికి తార్కాణమన్నారు. సంస్కరణలు అమలు చేయడం వల్లే తాను ఓడిపోయాయని ఒప్పుకున్న చంద్రబాబు ప్రస్తుతం అదే విధానాలను పాటిస్తున్నారని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాలపై కేంద్రీకరించి అభివృద్ధి చేయాల్సి ఉండగా దాని గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో అభివృద్ధి కేంద్రీకృతం అవడం ద్వారానే సమస్యలొచ్చాయని చెప్పిన పాలకులు ఇప్పుడు రాజధాని అమరావతి పేరుతో అదే పనిచేస్తున్నారని విమర్శించారు.

విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్రం ప్రకటించిందని, ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. దీనిపై చంద్రబాబు ప్రతిపక్షాలను కలుపుకుని పోరాడాల్సి ఉండగా మీనమేషాలు లెక్కిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక హోదా వస్తేనే ఉద్యోగాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు వస్తాయని తెలిపారు. దీనికోసం రాజకీయంగా పోరాడాల్సిన అవసరముందని చెప్పారు. అప్పట్లో టిడిపి పార్టీ ఏర్పాటు చేసిందే ఆత్మగౌరవం కోసమని, ప్రస్తుతం అటువంటిదేమీ కనిపించడం లేదని తెలిపారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రత్యేక హోదాపై పోరాడతానని ప్రకటించడం అభినందనీయమని తెలిపారు. గో సంరక్షణ పేరుతో బిజెపి చేస్తున్న అరాచకాన్ని పవన్ బయటపెట్టారని తెలిపారు.

రాష్ట్రంలో దేశంలో సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు సాగించిన పోరాటాలకు ప్రతీకగా విద్యుత్ పోరాటం నిలుస్తుందని తెలిపారు. అయినా పాలకులు మాత్రం విదేశీ పెట్టుబడిదారులకు, ఏజెంట్లకు కావాల్సిన ఏర్పాట్లను చేయడమే ధ్యేయంగా ముందుకెళుతున్నారని విమర్శించారు. కార్మికవర్గానికి, మధ్యతరగతికి సంకెళ్లు వేసి కావాల్సిన చట్టాలు చేసుకుంటూ పోతున్నారని పేర్కొన్నారు. పేదలు, పెద్దల మధ్య అగాధాన్ని మరింత పెంచుతున్నారన్నారు. విద్యా, వైద్య, వ్యవసాయరంగాల్లో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నాని, ఇది దేశానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని చెప్పారు. ప్రస్తుత పాలకుల తీరువల్ల రాబోయే సమస్యలను ప్రతిఘటించేందుకు విద్యుత్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని వారు కోరారు. అంతకుముందు అమరుల చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జె.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఐ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**అభివందనములతో.**

**జె.ప్రభాకర్**
ఆఫీసు కార్యదర్శి